క్లుప్తంగా

కోతులను అరికట్టాలని వినతి



కోతులను అరికట్టాలని అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరవాడ: పెదముషిడివాడ గ్రామస్తులపై దాడులకు పాల్పడుతున్న కోతులు గ్రామంలోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు బొండా అచ్చిబాబు, బలిరెడ్డి సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కోతులు విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని, ఈ విషయాన్ని గతంలో ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యమన్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా కోతులు రాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

గోరింటాకు శుభప్రదం



సమావేశంలో ప్రసంగిస్తున్న రామలక్ష్మి

పరవాడ: ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు అనేక విధాల మేలు జరుగుతుందని జిల్లా మహిళ కన్వీనర్ రామలక్ష్మి అన్నారు. లంకెలపాలెం సీతారాముల ఆలయం కేంద్రంగా సమరసతాసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరు గోరింటాకు చేతులు, కాళ్లకు పెట్టుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆషాడమాసంలో అతి పవిత్రమైన గోరింటాకును ప్రతి ఒక్కరు పెట్టుకొని పక్కవారిని కూడా ప్రోత్సహించాలని రామలక్ష్మి కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి, బొద్దపు నూకరత్నం, బొద్దపు పూర్ణ, ఎ. వెంకటరమణ, ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 1.5కిలోల గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాడేరు రూరల్ ఒడిశా బోర్డర్ నుంచి కిలోన్నర గంజాయి, 3కిలోల లిక్విడ్ గంజాయిని ఎన్ఏడీ కాకానినగర్ కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్, మరో మైనర్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విమాన్‌నగర్ నుంచి యల్లపువాని పాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో వల వేసి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, లిక్విడ్ గంజాయితో పాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపించారు.

ఈ నెల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎంవీపీ కాలనీ: డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ నెలలోనే విడుదల చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌ను నగరంలోని ఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చూస్తున్న ఎదురుచూపులతో పాటు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డీఎస్సీకి జనరల్ కేటగిరీ అభ్యర్థుల వయోపరిమితి అర్హతను 48 ఏళ్లకు పెంచాలని విద్యార్థి నాయకుడు సిర్లా శ్యామ్ కోరారు. కొన్నేళ్లుగా నోటిఫికేషన్స్ లేకపోవడంతో అర్హత ఉన్న వేల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందలేకపోయారన్నారు. నిరుద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

14న 'ఉక్కు విలీన' దీక్ష

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, రక్షించాలన్న డిమాండ్‌పై ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించనున్న ఉక్కు విలీన దీక్షకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం సీ భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 7 గంటలకు ఉక్కు అమరవీరుల కూడలి నుంచి సీ భవన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అనంతరం ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు దీక్ష నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై సమగ్ర సర్వే



గొల్లలపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



సర్వే చేస్తున్న జిల్లా సర్వేయర్ గోపాలరాజు తదితరులు

సబ్బవరం: ప్రభుత్వ భూమి హద్దులు మార్చి కబ్జా చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ విజయ ఆదేశాలతో జిల్లా సర్వేయర్ ఎస్. రాజగోపాలరాజు బుధవారం సబ్బవరంలో పర్యటించి సర్వే నిర్వహించారు. మండలంలోని సబ్బవరం,అసకపల్లి, గొటివాడ మూడు గ్రామాల సరిహద్దులో ఉన్న సబ్బవరం సర్వే నెంబర్ 271లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గతంలో కొందరు ఫిర్యాదు చేశారు.అయితే ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఫిర్యాదులు అందడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. జిల్లా సర్వేయర్‌తో పాటు మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు సబ్బవరం సర్వే నెంబర్ 274లోని జిరాయితీ, గొటివాడ సర్వే నెంబర్ 26లో జిరాయితీ,అసకపల్లి సర్వే నెంబర్ 2లోని ప్రభుత్వ భూములను ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 271లోని ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేశారు.ఎంత వరకూ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందనే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు జిల్లా సర్వేయర్ గోపాలరాజు తెలిపారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డులు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 1-1లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. 'సాక్షి' దినపత్రికలో గొల్లలపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ గణపతిరావు ఆదేశాల మేరకు బుధవారం ఆర్ఐ వీరయ్య,వీఆర్వో పూడి శేషు మిగిలిన సిబ్బందితో కలిసి ఆక్రమిత భూమిలో రాత్రికి రాత్రే నాటిన మామిడి మొక్కలు తొలగించారు.రెండు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. హరినామస్మరణ మార్మోగింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



విద్యార్థులకు మెడిసన్ వేస్తున్న డాక్టర్ అరుణ్‌ప్రకాష్

సింహాచలం: సీజల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడవివరం ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యుడు డాక్టర్ అరుణ్‌ప్రకాష్ సూచించారు. సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దగ్గు, జ్వరం, డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నిద్రించేటప్పుడు దోమ తెరలు వాడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రివెంటివ్ మెడిసన్ అందజేశారు. కార్యక్రమంలో హోమియో వైద్యశాల సిబ్బంది కె.పద్మావతి, వినోద్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాను పాల్గొన్నారు.

ఈఎస్ఐ సేవలు మెరుగుపర్చాలని వినతి



ఈఎస్ఐ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్టీపీసీ బీఎంఎస్ నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అధ్యక్షుడు బొట్టా రమణ కోరారు. నగరానికి విచ్చేసిన ఈఎస్ఐ చైర్మన్‌ను బుధవారం బీఎంఎస్ ప్రతినిధులు కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రులకు కార్మికులను రిఫర్ చేస్తే అక్కడ ఆస్పత్రి వర్గాలు చేర్చుకోవడానికి ముందుకు రావడం లేదన్నారు. ఈఎస్ఐ నుంచి బిల్లులు సకాలంలో రావడం లేదని అందుకే జాయిన్ చేసుకోవడం లేదని కారణం చెబుతున్నారన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఎస్ఐ పరిమితిని రూ.42 వేలకు పెంచాలని కోరారు. షీలానగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కె.సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.నాగభూషణం, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని నిరసన

సబ్బవరం: కార్మికులు,ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కార్మికులు,ఉద్యోగులు బుధవారం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌కు గణేష్‌కు వినతి పత్రం అందజేశారు.తొలుత అంగన్‌వాడీ,ఆశ కార్యకర్తలు,వెలుగు వీవోఏలు,మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, మెప్మా,సమగ్ర శిక్ష,ఉపాధి హామీ పథకం సిబ్బంది కనీసవేతనాలు చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉప్పాడ సత్యవతి, రమణమ్మ పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో డీఆర్ఎం భద్రతా తనిఖీలు



శివలింగపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కేకే లైన్ కొత్తవలస–శివలింగపురం మధ్య బుధవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ భద్రతా తనిఖీలు నిర్వహించారు. శివలింగపురం స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్ స్టేషన్స్, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడలు వంటి ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షా కాలంలో బండరాళ్లు ట్రాక్‌లపై పడేందుకు అవకాశమున్న ప్రాంతాలల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో డీఆర్ఎం మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీలు



మింది జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల నోట్ బుక్స్‌ను తనిఖీ చేస్తున్న డీఈవో చంద్రకళ

అక్కిరెడ్డిపాలెం: జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆమె పలు తరగతులను పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్. ఎస్.ఆంజనేయలును డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిని తిరిగి పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. హెచ్ఎంకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విశ్వనాథం, సునీత, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై నెల రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ నేటితో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో గత నెల 13వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు (సామాజిక వైద్య శాస్త్ర అధ్యాపకులు, గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, రేడియాలజిస్ట్, సాధారణ సర్జన్లు, రేడియేషన్ అంకాలజిస్టులు, సర్జికల్ అంకాలజిస్టులు) శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా టీం వారు శిక్షణ తీసుకున్నారు. జిల్లాలో ఉన్న 91 మంది వైద్యులు, 9 మంది స్టాఫ్ నర్సులు, 54 మంది సీహెచ్‌వో, 498 మంది ఏఎన్ఎంలకు బ్యాచ్‌ల వారీగా రోజుకు 40 మంది చొప్పున ఆంధ్ర వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆధ్వర్యంలో జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ కె. సాయిసుష్మ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు ఆహ్వానం

తగరపువలస : చిట్టివలస ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఉచిత శిక్షణకు సంప్రదించాలని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటాన మోహనరావు, రేఖ అప్పారావు కోరారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేలు వంతున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. మూడేళ్లుగా ఇస్తున్న ఉచిత శిక్షణకు చుట్టుపక్కల గ్రామాల హైస్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరై ఇప్పటి వరకు 41 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు చిట్టివలస హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావును సంప్రదించాలని కోరారు.

వామనావతారంలో జగన్నాథస్వామి



వామనావతారంలోని స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అగనంపూడి : జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం సుభద్ర, బలభద్రుని సమేత జగన్నాథ స్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గురు సంతోష్ ఉత్సవమూర్తులను అలంకరించారు. అగనంపూడి పరసర ప్రాంతాల భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గొల్లవిల్లి కనక భవానీ, వెంకటరావు, పండా కుటుంబీకులు పాల్గొన్నారు.

నేడు హేరా పంచమి : రథోత్సవాల ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా ఇంద్రద్యుమ్నహాలు వద్ద లక్ష్మీదేవి అమ్మవారు జగన్నాథస్వామి కోసం ఎదురుచూసే సన్నివేశం, స్వామి వారు రాలేదనే కోపంతో రగిలిపోతూ లక్ష్మీదేవి రథాన్ని విరగ్గొట్టి తిరిగి దేవాలయానికి వెళ్లిపోయే సన్నివేశాన్ని రక్తి కట్టించేలా హేరా పంచమి ఉత్సవాన్ని గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్టు కరణం పైడిరాజు తెలిపారు. అలాగే సహస్ర దీపాలంకరణ ఘనంగా నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

మర్యాద పూర్వక కలయిక



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సబ్బవరం నాయకుడు పల్లి గోవిందరాజు, 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్

పెందుర్తి/సబ్బవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ,97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, సబ్బవరం మండల వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పల్లి గోవిందరాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గోవిందరాజు, మహేష్‌ను జగన్ మోహన్‌రెడ్డి చిరునవ్వుతో పలకరిస్తూ భుజం తట్టి ఇకపై పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ మరింత ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు.

గురుకులాల్లో అద్భుత ఫలితాలు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం: వెనుకబడిన తరగతుల విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రారంభించిన గురుకుల విద్యాలయాలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ బాలురు గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీచేశారు. విద్యాలయంలోని వంటగది, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. భోజనం రుచి సంతృప్తికరంగా ఉన్నా...మెనూ ప్రకారం పదార్థాలు తయారు చేయకపోవడంపై ప్రశ్నించారు. ఇకపై మెనూప్రకారం పదార్థాలు కచ్చితంగా తయారుకావాలని హెచ్చరించారు. నిర్వహణ లోపాలను సరిచూసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యారావుకు సూచించారు.

సీఎం దృష్టికి భూ సమస్య

రెండు దశాబ్దాలకు పైగా ఉన్న సింహాచలం పంచగ్రామాల భూసమస్యను విశాఖలో గురువారం జరగబోయే సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని గంటా శ్రీనివాసరావు తెలిపారు. అమరావతికి సమాంతరంగా విశాఖను ఆర్థిక రాజధానిగా చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధతో ఉందన్నారు. కార్యక్రమంలో 98వవార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, నాయకులు పంచదార్ల శ్రీనివాస్, కోరాడ రాజబాబు, రౌతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

పరవాడ: కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు, ఉద్యోగులు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26000 చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఆటో, ముఠా, బిల్డింగ్ ఇతర అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేసి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు వర్తింప జేయాలని కోరారు. ఆశ, అంగన్‌వాడీ , మధ్యాహ్నం భోజన పథకం, వీవోఏలు, వీఆర్ఏలు వంటి స్కీం వర్కర్లకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సీహెచ్.దేవి, కె.రమణి, ఆశ యూనియన్ లీడర్ వరలక్ష్మి, వీవోఏల సంఘ ప్రతినిధి ఎం.ఉమామహేశ్వరి, వరలక్ష్మి, వీఆర్ఏ సంఘ ప్రతినిధి ఆర్.శంకర్, ఎం.రేవతి, పి.పైడిరాజు, రమణమ్మ, పి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గణపతిరావు

సబ్బవరం: మండలంలో విలువైన ప్రభుత్వ భూముల కబ్జాలు,ఆక్రమణకు పాల్పడినవారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎస్. గణపతిరావు ఆదేశించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇటీవల పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అటువంటి వాటిపై ఉపేక్షించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎక్కడ అక్రమణలు జరిగినా సిబ్బంది అంతా కలిసి వెళ్లి ఆక్రమణల తొలగింపు చేపట్టాలని,అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు పూడి శేషు,అనంత్,రుక్మిణి,నూకరత్నం,రవి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వెబ్ ఆప్షన్ల ఎంపిక



కంచరపాలెం పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆప్షన్ల ఎంపికకు వచ్చిన విద్యార్థులు

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం జోరుగా సాగింది. ఈ నెల 8న వెబ్ ఆధారిత కోర్సులు, కాలేజీల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ మొదటి రెండు రోజులు సర్వర్ సహకరించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రానికి సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయగా.. బుధవారం ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రానికి సుమారు వంద మంది విద్యార్థులు తరలివచ్చారు. సిస్టం అడ్మిన్ ఎస్.నాగరాజు పర్యవేక్షణలో ఆన్‌లైన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆదాయ ధ్రువ పత్రాలు, ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌తోపాటు మొబైల్ నంబర్ మార్పు, నాన్ లోకల్ అభ్యర్థులు స్థిర నివాస పత్రాలు అప్‌లోడ్ చేసుకున్నారు. లెక్చరర్ సిహెచ్.అప్పలనాయుడు విద్యార్థులకు సహకరించారు. 12వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. ఈ నెల 13న ఆప్షన్లు మార్చుకోవచ్చు.